# సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి..

**• బీఆర్‌ఎస్ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి • మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో భేటి**

మలక్‌పేట, అక్టోబర్ 12 : ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, ప్రజలు బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి గెలిపిస్తారని ఆ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత గురువారం మొదటిసారిగా మలక్‌పేటలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు పొందారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మొదటిసారి పోటీ చేస్తున్న తనకు అందరి ఆశీస్సులు అందించాలని కృష్ణారెడ్డిని కోరారు. సానుకూలంగా స్పందించిన కృష్ణారెడ్డి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం తీగల అజిత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు చేరాయని, అవి వారికి ఆసరాగా నిలిచాయని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందని, ముఖ్య మంత్రి కేసీఆర్ దార్శనిక పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ అభిషేకం, అజిత్‌రెడ్డి తండ్రి తీగల సుభాశ్‌రెడ్డి, నాయకులు సాగర్,ప్రభు, శ్రీధర్‌రెడ్డి, పీటర్ పాల్గొన్నారు.


మలక్‌పేటలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**• ఓయూ బోటనీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పీ. కమలాకర్**

మలక్‌పేట, అక్టోబర్ 12 : సమస్త ప్రాణికోటి మనుగడకు మూలాధారం ప్రకృతేనని, ప్రకృతిని పరిరక్షిస్తే, ప్రకృతి మనల్ని రక్షిస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ(వృక్షశాస్త్ర) విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పి. కమలాకర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబీసెంట్ మహిళా కళాశాలలో గురువారం 'పర్యావరణ పరిరక్షణలో మొక్కల ఆవశ్యకత'అనే అంశంపై నిర్వహించిన 'గ్రీన్ వరల్డ్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతిలో అనేక రకాల ఔషధ మొక్కలు, వన మూలికలు ఉన్నాయని, వాటిలో ఎన్నో రుగ్మతలకు సంబంధించిన ఆయుర్వేద మెడిషనల్ పదార్థాలు ఉన్నాయని తెలిపారు. ప్రకృతిపై సరైన అవగాహన లేక వాటిని సద్వినియోగ పరుచుకోలేకపోతున్నామని అన్నారు. పూర్వీకులు ఎలాంటి వైద్యం అందుబాటులో లేనపుడు వన మూలికలతోనే అన్ని జబ్బులను నయం చేసుకొని ఆరోగ్యంగా జీవించారని పేర్కొన్నారు. సృష్టికి మూలాధారమే ప్రకృతి అని, ప్రకృతిని పరిరక్షించుకోవటం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం బోటనీ విద్యార్థినులు ప్రదర్శించిన ఔషధ, ఆహార, పూల మొక్కలను ఆయన తిలకించారు. ఔషధ మొక్కలు ఆరోగ్యంగా జీవించటానికి, ఆహార మొక్కలు మన శరీరానికి అనేక రకాల పోషక పదార్థాలను, ప్రోటిన్లను, విటమిన్లను అందిస్తూ ఆరోగ్యకరంగా జీవించేందుకు ఉపయోగపడుతున్నాయని, పూలు కేవలం పూజకు, అలంకారానికే కాకుండా మెడిషనల్, కాస్మోటిక్ పదార్థాలుగా ఉపయోగపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దయాకర్, ప్రిన్సిపాల్ సురేఖ,అధ్యాపకులు అర్షా భాను, అర్షా అఫ్రీన్, విశాల,కల్పన, విద్యార్థినులు పాల్గొన్నారు.


దిల్‌సుఖ్‌నగర్ అనిబీసెంట్ మహిళా కళాశాలలోవిద్యార్థినులు ప్రదర్శించిన ఔషధ, ఆహార, అలంకార పూల మొక్కలను తిలకిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగాధిపతి ప్రొఫెసర్ కమలాకర్

## స్పెషల్ రైల్లో దొంగతనం

కాచిగూడ,అక్టోబర్ 12: లాల్‌గ్రా స్పెషల్ రైల్లో ప్రయాణికుని బ్యాగులోంచి డైమండ్స్, బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సోమాజిగూడకు చెందిన డీవీ బర్వాడా కుమారుడు రాజేశ్‌బర్వాడా (60) జ్యూవెల్లరీ వ్యాపారి. కాచిగూడ–లాల్‌గ్రా స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో చూసుకునేసరికి బ్యాగులో ఉన్న 25.80 కారెట్స్ డైమండ్స్, 7 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.95 వేలు, 1300 వందల దుబాయ్ నోట్లు కన్పించలేదు. దీంతో ఆయన గురువారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

## పాఠశాలలో బతుకమ్మ సంబురాలు


చంపాపేటలోని ఓ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. – సైదాబాద్, అక్టోబర్ 12

## రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స


రొమ్ము క్యాన్సర్‌పై వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చాదర్‌ఘాట్, అక్టోబర్ 12: రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే తప్పకుండా చికిత్స చేయవచ్చునని హెచ్‌ఓడీ, సీనియర్ అనస్తీషియా డాక్టర్ సజ్జాద్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలగా పేర్కొన్నది. ఇందులో భాగంగా గురువారం మలక్‌పేటలోని బీబీ క్యాన్సర్ దవాఖాన ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఎంఏ సలాం షాహీద్, మినాజుద్దీన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దవాఖాన సీఈఓ డాక్టర్ సజ్జాద్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ నానాటికీ పెరుగుతున్నదన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించాలని, మమోగ్రఫీ వంటి పరీక్షలను తరచూ చేయించుకోవాలని సూచించారు. శరీరంలో నొప్పి లేకుండా ఎటువంటి వాపు వచ్చిన క్యాన్సర్ కణతిగా అనుమానించాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించేందకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆంకాలజిస్ట్ సర్జన్ డాక్టర్ సౌమ్య రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇలియాస్, డాక్టర్ వికాస్, జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న కామినేని దవాఖాన వైద్యులు

సైదాబాద్, అక్టోబర్ 12 : సైదాబాద్ లక్ష్మీనగర్ షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్బీనగర్ కామినేని దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొని భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. వైద్యశిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు, భక్తులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత, ఫలాక్, సిస్టర్లు శిరీష, ప్రవళ్లిక, అల్సా, మార్కెటింగ్ ప్రతినిధి బాలకృష్ణ, షిర్డీసాయి ఆలయ కమిటీ ప్రతినిధులు నేరెళ్ల ప్రసాదరావు, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యంగా పీడీఎస్‌యూ పోరాటం


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరశురాము

మలక్‌పేట, అక్టోబర్ 12 : శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యంగా పీడీఎస్‌యూ పోరాడుతున్నదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరశురాము తెలిపారు. పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాకేత డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి విప్లకారులు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని 49 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ పోరాడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, పొడపంగి నాగరాజు, ఉపాధ్యక్షుడు వి.రవీందర్, కోశాధికారి కీర్తి, జిల్లా నాయకులు శ్యామ్, సమీర్, మమత, వైష్ణవి, ప్రసాద్, వెంకటేశ్, పవిత్ర, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

కాచిగూడ,అక్టోబర్ 12: దేశంలో 70 కోట్ల మంది ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను కల్పించేలా బీజేపీ, కాంగ్రెస్, తదితర పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టులో చేర్చాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కులగణన చేట్టి, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

## మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు



| కూరగాయలు | కిలో రూ. | కూరగాయలు | కిలో రూ. |
|---|---|---|---|
| ఆలుగడ్డ | 20 | సొరకాయ | 10 |
| టమాట | 16 | క్యాబేజ్ | 12 |
| వంకాయలు | 20 | క్యారట్ | 30 |
| బెండకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 20 |
| మిర్చి | 30 | దొండ | 20 |
| గోకరకాయ | 20 | కీర | 25 |
| చిక్కుడు | 40 | దోసకాయ | 25 |
| బిన్నీస్ | 40 | క్యాప్సికమ్ | 34 |
| బీరకాయ | 20 | బీట్‌రూట్ | 20 |
| కాకరకాయ | 20 | | |

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు